క్లుప్తంగా

వైభవంగా గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



కంకిపాడు: మండలంలోని మద్దూరు గ్రామం పాత ఎస్సీ కాలనీలో వేం చేసి ఉన్న గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. వేద మంత్రాల నడుమ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై దాడి జరిగిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు శివపార్వతీనగర్ 3వ లైన్‌లో ఎక్సైజ్ శాఖలో పని చేస్తున్న గండికోట నాగరాజు నివాసం ఉంటున్నాడు. అయితే అతని పక్క ఇంట్లో ఉంటున్న నాని అనే వ్యక్తి తన కారును నాగరాజు ఇంటి ఎదురుగా పార్కు చేశాడు. దీంతో నాగరాజు అభ్యంతరం తెలుపటంతో నాని గొడవకు దిగాడు. నాగరాజు, అతని కుటుంబ సభ్యులపై నాని దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం



గన్నవరం: స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి గ్రామానికి చెందిన నర్రా శేఖర్‌ప్రసాద్ కుమారుడు శివఆదిత్య రూ.50,249 విరాళం అందజేశారు. ఈ మేరకు గురువారం శివఆదిత్య కుటుంబ సభ్యులు విరాళం నగదును ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. శివఆదిత్య ఉద్యోగంలో చేరిన తర్వాత తొలి జీతం ఆలయానికి ఇవ్వడం అభినందనీయమన్నారు. భక్తులందరి సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ సేవాసదనాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పొట్ల శివలీల, నర్రా ఉమావతి, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



ఉంగుటూరు: మొక్కల పెంపకంతో పర్యావరణం పరిరక్షించబడుతుందని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. పొట్టిపాడులో గురువారం నిర్వహించిన తల్లి పేరుతో మొక్క కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని సర్పంచ్ కత్తుల జ్యోతితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కంకిపాడు: సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు కంకిపాడులో గురువారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని సినిమా హాలు సెంటరులో చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్ల వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ, స్థానిక నేతలు కొప్పరాజు సురేష్, కొండా నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, మేకల నాగేశ్వరరావు, పలువురు యువత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో గురువారం గణపతికి విశేష అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం గణపతి స్వామికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చన, గణపతి మంత్ర హవనం(హోమం)ను అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఆదమరిస్తే గల్లంతే
- బుడమేరుపై వంతెన రెయిలింగ్ ధ్వంసం
- వాహనాల తాకిడికి ధ్వంసమైన రెయిలింగ్
- కన్నెత్తి చూడని యంత్రాంగం



బుడమేరుపై ఉన్న వంతెన

కంకిపాడు: ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. ఇనుప రెయిలింగ్ ధ్వంసమై ఏ క్షణాన ఏ ప్రమాదానికి కారణం అవుతాయో అర్థం కాని పరిస్థితి. నిత్యం రద్దీగా ఉండే రహదారి మార్గంలో ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోకపోవటం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే...

కంకిపాడు – గన్నవరం రోడ్డు మార్గంలో ఉప్పలూరు మీదుగా బుడమేరు ప్రవహిస్తోంది. బుడమేరుపై వాహనాల రాకపోకలకు వీలుగా వంతెన నిర్మించారు. వంతెనకు ఇరువైపులా రోడ్డు భద్రత దృష్ట్యా ఇనుప రెయిలింగ్ ఏర్పాటుచేశారు. నిత్యం ఈ మార్గం గుండా వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. మచిలీపట్నం, గుడివాడ ప్రాంతాల పరిసర గ్రామాల నుంచి విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఈ మార్గాన్ని ప్రధాన మార్గంగా వినియోగిస్తుంటారు.

అధిక సంఖ్యలో ప్రమాదాలు

అధిక లోడుతో భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. అంతే కాకుండా గన్నవరం పరిసరాల్లో రబ్బిష్, మట్టితో టిప్పర్లు, కంకిపాడు, పెనమలూరు మండలాల్లో ఏటిపాయ నుంచి ఇసుక తరలించే వాహనాలు సైతం ఈ మార్గానే వెళ్తుంటాయి. దీంతో వాహనాల తాకిడికి ఇనుప రెయిలింగ్ ధ్వంసమైపోతుంది. కంకిపాడు – గన్నవరం రహదారి మార్గం ఈ బుడమేరు వంతెన సమీపంలో ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు ఒకదాన్నొకటి తప్పుకునే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. దీని వల్ల వంతెన అంచుల్లో ఉన్న రెయిలింగ్ విరిగిపోయి ధ్వంసమైంది. అయితే ఈ ప్రమాదాలు చాలా వరకూ స్టేషన్ల వరకూ చేరటం లేదు.



ధ్వంసమైన ఇనుప రెయిలింగ్

మరమ్మతులు చేపట్టాలి..

ఇనుప రెయిలింగ్ ధ్వంసమై, వంతెన మీద ఉన్న రోడ్డు మార్గం గోతులు పడి అధ్వానంగా మారినా అటు ఆర్‌అండ్‌బీ, ఇటు డ్రెయినేజీ అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాలు అదుపుతప్పి బుడమేరులో పడిపోతే ప్రమాద స్థాయి తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన రెయిలింగ్, వంతెన రహదారి మార్గం మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కంకిపాడు జెడ్పీ హైస్కూల్‌లో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

కంకిపాడు: గంజాయి, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కంకిపాడు సీఐ జె.మురళీకృష్ణ సూచించారు. జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు ఆదేశాలతో, గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కంకిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, కుందేరు, కోలవెన్ను గ్రామాల్లో ఎస్‌ఐ డి.సందీప్‌తో కలిసి గురువారం గంజాయి, మత్తు పదార్థాల వినియోగం – అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో, సక్రమమైన నడవడిక అలవర్చుకోవాలన్నారు. మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరంగా మారతాయన్నారు. గంజా రవాణా, వినియోగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయికి సంబంధించిన సమాచారం అందించాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సదస్సులో హెచ్‌ఎం బి.భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభలు

గన్నవరం: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గుర్తించేందుకు శుక్రవారం గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామసభలో ఉపాధి హామీ కూలీల హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు పురోగతిలో ఉన్న పనులు, కొత్త పనుల వివరాలను ప్రకటిస్తామన్నారు. అదే విధంగా సోషల్ ఆడిట్‌ను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో ఈ గ్రామసభలు జరుగుతాయన్నారు.

నేటి గ్రామ సభలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించి ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, జరగాల్సిన అభివృద్ధి పనులపై చర్చిస్తారు. అలాగే ఉపాధి హామీ పనులు గుర్తించి జరగాల్సిన తీరుపై సమీక్షిస్తారు. ఈ సమావేశాలకు ఆయా గ్రామ ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరై పలు అంశాలు, అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తారు.

రూరల్ మండలంలో గ్రామసభలు

విజయవాడరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.భార్గవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద విజయవాడ రూరల్ మండలానికి మంజూరైన గ్రాంట్‌తో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి అంబాపురం, పాతపాడు, పి.నైనవరం, నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు జరుగుతాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద మండలానికి ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం రూ.5 కోట్లను మంజూరు చేసిందన్నారు. గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని ఎంపీడీఓ కోరారు.

నున్నలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య



నున్న గ్రామంలో నిలిచిన స్కూల్ బస్సులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. విజయవాడ, హైదరాబాద్ నుంచి వచ్చే లారీలు నూజివీడు, సత్తుపల్లి, పై ప్రాంతాలకు లోడులతో గ్రామం మీదుగా రాకపోకలు సాగించడంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుంది. నున్న మామిడికాయల మార్కెట్ వద్ద నుంచి నూజివీడు వైపు వెళ్లేందుకు లోకల్ బైపాస్ ఉన్నప్పటికీ అ మార్గంలో వెళ్లకుండా గ్రామం లోపలకు వచ్చి వాహనాలు వెళ్లడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయాల్లో లారీలు రావడంతో ఎదురుగా వచ్చే ఆర్టీసీ బస్సులు, కాలేజీ బస్సులు, ఇతర వాహనాలతో రద్దీగా ఉంటుంది.

రోడ్లపైనే వ్యాపారాలు..

చెరువు సెంటర్‌లో రోడ్డు వెంబడి మొబైల్ బండ్లపై వ్యాపారాలు నిర్వహించడంతో రోడ్డు పక్కనే ద్విచక్రవాహనాలు పార్కు చేసి ఉంచడం ట్రాఫిక్ సమస్యకు మరో కారణంగా చెప్పవచ్చు. ట్రాఫిక్ సమస్యను క్లియర్ చేయడానికి ట్రాఫిక్ కానిస్టేబుళ్లు అప్పుడప్పుడు వచ్చి వెళ్లుతుండటం జరుగుతుందే తప్ప ప్రతి రోజూ రాకపోవడంతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతుంది. రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వ్యాపారాలను నియంత్రించడంతో పాటు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉంగుటూరు ఎస్‌ఐగా గోవిందు



ఉంగుటూరు: ఉంగుటూరు ఎస్‌ఐగా యు.గోవిందు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా రెడ్డిగూడెం నుంచి ఉంగుటూరుకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా విధులు నిర్వహించిన రవి చంద్రకుమార్ తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు బదిలీపై వెళ్లారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గోవిందును స్టేషన్ సిబ్బంది అభినందించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ కేంద్ర కమిటీ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు చేతుల మీదుగా 50 మంది పేద వృద్ధులకు గురువారం దుప్పట్లు అందజేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సీనియర్ సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, పాట్లూరి శేషాచలం, జన్యావుల సత్యనారాయణ, నారగాని కొండలరావు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఇంజినీర్ సీతారామయ్య కన్నుమూత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ సూరపనేని సీతారామయ్య (86) గురువారం ఉదయం కన్నుమూశారు. ఈయన కంకిపాడు మండలం, మారేడుమాక గ్రామంలో కేశవనారాయణ, సరస్వతమ్మకు 1939లో జన్మించారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. బెంగళూరులో బీఈ ఎలక్ట్రికల్ చదివారు. నార్ల తాతారావు వంటి ప్రముఖులతో కలిసి సీతారామయ్య పనిచేశారు. విజయవాడ థర్మల్ కేంద్రం 4, 5 యూనిట్లను 18 నెలల కాలంలో పూర్తి చేశారు. రిటైరైన తరువాత కూడా దేశంలోని వివిధ కంపెనీల్లో సీతారామయ్య 75 ఏళ్ల వచ్చే వరకు నిర్విరామంగా విధులు నిర్వర్తించారు. కొండపల్లి లాంకో పవర్ స్టేషన్, నాగపూర్‌లోని పవర్ ప్లాంట్, రాజస్థాన్‌లోని సూరత్ ప్లాంటు, పానిపట్ పవర్ ప్లాంట్ మొదలైన ప్రాజెక్టుల్లో ఈయన పనిచేశారు. ఈ ఏడాది జూన్‌లో మారేడుమాకలో 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోదరుడైన డాక్టర్ రామబ్రహ్మంతో కలసి సీతారామయ్య భూమిని దానంగా ఇచ్చారు. గురునానక్ కాలనీలోని డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలో సీతారామయ్య భౌతికకాయాన్ని ఉంచారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబసభ్యులు చెప్పారు.

అంబాపురంలో డ్రెయినేజీ నిర్మాణాలు



అంబాపురంలో నిర్మిస్తున్న డ్రెయిన్లు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామం(పైపులరోడ్డు వద్ద) ఒకటో వార్డులో డ్రెయినేజీ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. మురుగుకు కేరాఫ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో డ్రెయినేజీ కాల్వల నిర్మాణాలు జరగడంతో ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మూడు లక్షల రూపాయల అంచనాలతో రెండు కిలోమీటర్లలో డ్రెయినేజీ కాల్వల నిర్మాణాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రజలు నివసించే పది లైన్లు కవర్ చేస్తూ కచ్చా డ్రైన్ల నిర్మాణంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా పైపులైను వేస్తున్నారు. డ్రెయిన్ మొత్తం గుడ్‌విల్ ఏజెన్సీ ప్రాంతానికి చేరుకొని అక్కడ నుంచి బుడమేరులోకి మురుగునీరు పంపుతున్నట్లు గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య చెప్పారు. గ్రామ పంచాయతీ నిధులతో డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు.

మట్టి నమూనా పరీక్షలతో బహుళ ప్రయోజనాలు



సూరంపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఎంఏఓ లక్ష్మీ తేజస్వి

గన్నవరం రూరల్: మట్టి నమూనా పరీక్షలతో బహుళ ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు తెలిపారు. సూరంపల్లి శివారు రామచంద్రాపురంలో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మట్టి నమూనాలను సేకరించి వాటిని పరీక్షించే విధానాన్ని రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. మట్టి నమూనాలు సేకరించి వాటిలోని నత్రజని, కర్బన, పీహెచ్ మట్టి నమూనాల సేంద్రియ కర్బన శాతం ఎంత మోతాదులో ఉంటుందో తెలుసుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకంతో భూమిలో ఉండే సూక్ష్మ పోషకాలు దెబ్బతింటాయని చెప్పారు. మందులను అవగాహన లేకుండా విపరీతంగా వాడటం మంచిది కాదన్నారు. రేపటి తరానికి భవిష్యత్ అందించేందుకు అందరూ కష్టపడతారని, రైతులుగా మనం భావితరానికి ఆరోగ్యవంతమైన నేలను అందించాల్సిన అవసరం ఉందన్నారు.

మట్టితో మానవ మనుగడ..

మట్టిని కాపాడుకుంటేనే మానవ మనుగడ కొనసాగుతుందని ఏడీఏ చెప్పారు. భూమిలో లోపించిన పోషకాలను ఎరువుల రూపంలో అందించాలన్నారు. సేంద్రియ పద్ధతిలో అందించటం ఉత్తమమన్నారు. అందుకే ప్రభుత్వం సార్వా సాగుకు ముందే పచ్చిరొట్ట విత్తనాలు రైతాంగానికి అందజేస్తుందని పేర్కొన్నారు. వీటిని సాగు చేసి భూమిలో కలియదున్నడం ద్వారా భూమిని సారవంతం చేసుకోవటం సాధ్యమన్నారు. రైతాంగం మట్టి నమూనాలను పరీక్షలు చేయించుకుని, భూమికి అవసరమైన పోషకాలు అందించి, మంచి పంటల దిగుబడి సాధించాలని సూచించారు. ఎంఏఓ లక్ష్మీ తేజస్వి మాట్లాడుతూ.. రైతులకు నిరంతర సహకారం అందజేస్తోందని, ఉపయోగించుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సహాయకులు, రైతులు కాసరనేని పాపారావు, రాజా, గుండపనేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు



పెనమలూరులో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకటరమణ

పెనమలూరు: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు అన్నారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాల మేరకు పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. స్మార్ట్ ఫోన్ల వినియోగం తరువాత సైబర్ నేరాలు చాలా పెరిగాయన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగంపై అవగాహన లేకపోవటం, నగదు సంపాదించాలనే అత్యాశ కారణంగా ప్రజలు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని తెలిపారు. సెల్ ఫోన్లకు వచ్చే ఓటీపీలు ఎవరికీ చెప్పరాదని, అకౌంట్‌లకు వేరువేరు పాస్‌వర్డ్ పెట్టుకోవాలని, పాస్‌వర్డ్‌లు ఎప్పటికప్పుడు మార్చుకోవాలని, పబ్లిక్ ప్రాంతాల్లో వైఫై ఉపయోగించే సమయంలో బ్యాంకింగ్ కార్యకలాపాలు చేయవద్దన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఉంచరాదని పెట్టవద్దని చెప్పారు.

ఎల్‌హెచ్‌ఎం సిస్టమ్ అమర్చుకోవాలి..

అధిక జీతాలు, వర్క్ ఫ్రమ్ హోం వంటి ఉద్యోగాలు నమ్మరాదని, నగదు ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని వచ్చే మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. మోసాలకు గురైన వారు 1930 హెల్ప్‌లైన్‌కు వెంటనే ఫోన్ చేయాలన్నారు. అలాగే సైబర్ మిత్ర 91212 11100 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ కాల్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పారు. సీఐ జే వెంకటరమణ మాట్లాడుతూ ఇంటికి తాళం వేసిన సమయంలో ఇంట్లో బంగారం, సొమ్ము ఉంచకూడదన్నారు. ఇంటికి తాళం వేస్తే పోలీస్‌స్టేషన్‌లో చెప్పి ఎల్‌హెచ్‌ఎం సిస్టమ్ అమర్చుకోవాలని సూచించారు. సదస్సులో ఎస్‌ఐలు రమేష్, ఉషారాణి, స్థానికులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో పాము కాటుకు ఇద్దరి మృతి



రాజు మృతదేహం



సుబ్బారావు మృతదేహం

పెనమలూరు: పాము కాటుకు వేర్వేరు ప్రాంతాల్లో గురువారం ఇద్దరు మృతి చెందారు. తాడిగడపలో పాము కాటుకు గురైన వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కోడూరుకు చెందిన కె.సుబ్బారావు(60) కొంత కాలంగా పెదపులిపాక గ్రామంలో నివాసం ఉంటున్నాడు. అతను పశువుల గడ్డి కోసి విక్రయిస్తుంటాడు. కాగా బుధవారం తాడిగడప గ్రామ పరిధి గ్రీన్ సిటీ వద్ద పొలంలో గడ్డి కోస్తుండగా ఆయనను తాచుపాము కాటేసింది. వెంటనే ఆయనను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న సుబ్బారావు గురువారం మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన ఓగిరాలలో కౌలు రైతు..

ఉయ్యూరు: పాము కాటుకు కౌలు రైతు మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో చోటుచేసుకుంది. చిన ఓగిరాల గ్రామానికి చెందిన కందుకూరి రాజు(35) కౌలు రైతు. గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ విజయవాడలో ప్రైవేటు ఉద్యోగిగానూ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం ఉదయం పొలంలో నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. కాలువ నుంచి పొలానికి గండి తీసే క్రమంలో కాలుపై పాము కాటు వేసింది. వెంటనే రాజును కుటుంబ సభ్యులు ఉయ్యూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఉదయం 10.30 గంటలైనా వైద్యులు అందుబాటులో లేకపోవటంతో సిబ్బందే వైద్య సేవలు అందించారు. రాజు పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ తీసుకెళ్లమని సలహా ఇచ్చారు. 108 వాహనం అందుబాటులో లేకపోవటంతో అక్కడే మృతి చెందాడు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి మాట్లాడుతూ.. రాజుకు వ్యాక్సిన్ ఇచ్చామని, అప్పటికే విషం నరాల ద్వారా మెదడుకు చేరటంతో మృతి చెందాడన్నారు. రాజుకు భార్య, బాబు, పాప సంతానం. ఘటనపై ఉయ్యూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలి



పెనమలూరు: పర్యావరణాన్ని పరిరక్షించటానికి అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని ఎంపీడీఓ సునీతాశర్మ చెప్పారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీల్లో 1,200 మొక్కలు నాటడానికి ఉద్యానవ శాఖ నుంచి మొక్కలు వచ్చాయన్నారు. వేప, గానుగ తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఓ లోయ శివశంకర్‌రావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., Labbipet Branch, VJA వారి [illegible]

Regd. Post with Ack Due [illegible]

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నేతలు

కంకిపాడు: కేరళలో వయనాడ్ బాధిత కుటుంబాలను ఆదుకోవటం మానవత్వమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పంచకర్ల రంగారావు అన్నారు. వరద బాధితుల సహాయార్థం కంకిపాడులో గురువారం విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ.. కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ప్రకృతి వైపరీత్యం వల్ల భారీ నష్టం వాటిల్లిందన్నారు. కేరళను కేంద్రం ఆదుకోలేదని విమర్శించారు. విపత్తుల సమయంలోనూ కేంద్రం రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి కేరళ వరద బాధితులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.శివశంకర్, జి.కుమారి, సీహెచ్ శ్రీహరి, ఎం.చంటిబాబు, వి.మరియదాసు, వి.జాన్ మోజేస్, జె.రవి, వేమూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య చర్యలతో నష్ట నివారణ



కాసరనేనివారిపాలెంలో రైతులకు యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న ఏఓ కిరణ్

కంకిపాడు: మేలైన యాజమాన్య చర్యలతో పంట నష్టాన్ని నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ తెలిపారు. మండలంలోని కాసరనేనివారిపాలెం గ్రామంలో పొలం బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామంలోని వరి క్షేత్రాలను రైతులతో కలిసి సందర్శించారు. వరి పంటలో పచ్చ పురుగు/ఆకు చుట్టు పురుగు ఉందని, రైతులు యాజమాన్య చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకు ఎరువులు, పురుగు మందులు వినియోగించాలన్నారు. సమర్థంగా యాజమాన్య చర్యలు తీసుకోవటం ద్వారా పంట నష్టాన్ని నివారించుకోవచ్చని, అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.